కథానిక

# పరిష్కారం

శ్రీ కె. వి. రమణ

సూర్యుడు చచ్చిపోయినట్లు లోకమంతా చీకట్లు క్రమ్మాయి. తరుముబడే దొంగల్లా పక్షులన్నీ గూళ్లను జేరుకుంటున్నాయి. స్వాధీనం తప్పిన కండరాలను కూడకట్టుకొని గుమ్మంలో కూలబడ్డాడు రామం. ఆ చీకటి జుట్టు విరజిమ్ముకొన్న రాక్షసిలా కనుపించింది. ఆమె వెనుక కృష్ణయ్యలు చప్పట్లు చరుస్తున్నట్లు భావించాడు. అసలు తనీరోజున కృష్టయ్యదగ్గరికి పోకపోయినా బాగుండునని బాధపడ్డాడు. దూరంగా క్షణమాత్రంలోనే ఎర్రటి మంటలు లేచాయి. ఏదో పల్లె తగలబడుతోంది. వూళ్లో జనమంతా తండోపతండాలుగా వీధుల్లోకి వచ్చి ఆ దృశ్యం చూస్తున్నారు. కొంతమంది కర్రలు ముంతలు పుచ్చుకొని ఆ దెసకు పరుగులు దీస్తున్నారు. అన్నీ తాటాకు కొంపలు. ఏమీ చప్పుడు కాకుండా కాలిపోయాక ఆకాశం క్రమంగా ఎరుపుతగ్గి నల్లటి పొగతో నిండిపోయింది. కాలిన దూడల అర్పులు మనుష్యుల రోదన, మంటల నార్పే యోధుల అట్టహాసాలు అన్నీ పొగతో కలసి ప్రయాణం చేస్తున్నాయి.

పదిరోజులక్రితం మాణిక్యం చితిమీదినుంచి పొగ యిల్లాగే వచ్చింది. పొగలోనుంచి తనని 'ఒక్కసారి చూసిపొమ్మని' మాణిక్యం బ్రతిమాలుతున్నట్లనిపించింది. తనకీ ఆమెకీ మధ్య మంచుపొగ అడ్డు. ఆ తెర తొలగించి ముందుకుపోయే ధైర్యం, ఆమె బ్రతికిఉండగా తనకి కలుగలేదు. ఆమె ముందుకు వచ్చి ఈ పొగలో కలసిపోయింది. పోతూ, ఈలోకంలోని కాకులమేతకు తన కూతుర్ని విడచిపోయింది. ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూచాడు రామం. ప్రక్కయింటి సుబ్బయ్య మీసం మెలేస్తూ కళ్లు తిప్పుతూ అన్నాడు. "యింకా ఇక్కడే వున్నావేం. మాణిక్యం కూతురు ఒకత్తెగా ఆయింట్లో వుంట." రామానికి ఆమాటల్లో పోటు అర్థమవకపోలేదు. మాణిక్యం జబ్బులో వుండగా, సుబ్బయ్య ఆమెను చూడ్డానికని వంక పెట్టుకొని యింటికి వెళ్ళి ఆ అమ్మాయిచేయి పట్టుకొని, చీవాట్లు తిని బయటికి వచ్చిన సంగతి రామం మరచిపోలేదు. కాని సమాధానం చెప్పే ఓపికలోలేదు. వెకిలిగా నవ్వుకొంటూ కండలు ఝళిపించుకొని మంటలు ఆరిన దెసకి నడిచాడు సుబ్బయ్య. ఈ సుబ్బయ్యలు కృష్ణయ్యలు, వాళ్లి మేడలుమాత్రం శాశ్వతంగా వుండిపోతాయి. ఎన్ని భూకంపాలు వచ్చినా, ఆకాశం మంటలు మండినా వాళ్ల లోకానికేమీ ప్రమాదం రాదు. కడుపులో ఆకలిమంటల వేడి హెచ్చుతోంది. హృదయంలో ద్వేషాగ్ని; పాలిపోయిన మొహంలో కళ్లు నిప్పుల్లా వున్నాయి. ఈ మంటలు మనిషిని బూడిద చెయ్యవు. చావకుండా, బ్రతకలేకుండా మాత్రం చేస్తాయనుకొన్నాడు. బడబాగ్ని యింతే. చుట్టూ నీరువున్నా అది వెలుగుతూనే వుంటుంది. తను ఈరోజున కృష్ణయ్యయింటికి వెళ్ళకపోయినా, కృష్ణయ్య మరోరోజున తనదగ్గరకివచ్చి తనపని కాస్తా నెరవేర్చుకుపోయేవాడే!

మధ్యాహ్నం రోహిణీ కార్తె ఎండలో కృష్టయ్యదగ్గరకి ప్రయాణం కట్టాడు. పాటిమన్ను, మెత్తగానే వుంటుంది. లోపలికి పాదాలు దించుకుపోగానే, కౌగలించుకొని పీక నులిమినట్లుగా, మాడ్చేస్తుంది. పాదాలు బొబ్బలు కడుతున్నాయి. దూరంగా, 'జగమంతా మాయే...' అని పాడుతూ ఆడుతూ పోయే పశువుల కుర్రాడిని చూచి, తనకా మాత్రం ఓపిక లేదా అని అభిమానపడి అడుగులవేగం హెచ్చించాడు. మొహంమీద లంకలు వేస్తూ ప్రవహించే స్వేదనదుల గతులగురించి ఆలోచించాడు. ఈ నదులు ఎవరికీ వుపయోగకారి కావు—తన బ్రతుకు అంతే. కాలంలో గుర్తులేకుండా కలిసిపోతాయి. ఈ ఆలోచన చాలాసార్లు వచ్చింది రామానికి. క్రిందటి వేసంకాలంలో తనతో నిత్యమూ కలిసి తిరిగే సుబ్బారావుగారు గుర్తుకువచ్చారు. 'విజ్ఞానఖని' అని అధికారులు అనేవారు. ఇంట్లో పెళ్ళికాని కూతురు, చదువు చెప్పించలేని కొడుకు మంచంపట్టిన భార్య, పుస్త

కాల్లో మునిగిపోయ్యే అతనూ చాలామందికి తెలియరు. కాలేజీలు తెరచిన రోజు—10 గంటలకు అందరూ హాస్పిటలుకి పరుగెత్తుతున్నారు. క్రిందటి రాత్రి, గుండెనొప్పి వచ్చి ఆయన హాస్పిటల్లో జేరిన సంగతి భార్యకి, గేటుదగ్గర గుమాస్తాకి, వార్డులో నర్సుకి మాత్రం తెలుసు. ఉదయం అందరికీ తెలిసిపోయింది చచ్చిపోయాడని...దీనికోసమేనా ఆయన యింతకాలం కష్టపడ్డది. ఈ ప్రశ్నే చాలాసార్లు రామాన్ని యెదుర్కొంది. ఇప్పటికీ సమాధానం దొరకలేదు. క్రమంగా తను 'నిరాశావాది'గా తయారవుతున్నానేమో నని అనుమానపడ్డాడు. నవ్వుకొన్నాడు...కృష్ణయ్య యీ ఎండలో ఎక్కడికీ పోడులే అనుకొన్నాడు. అతనితో స్నేహం ఒక విచిత్ర సంఘటన.

యూనివర్సిటీ పరీక్షలు. కృష్ణయ్య ఏమీ చదవలేదు. వూళ్ళో తలెత్తుకు తిరగలేడని తెలుసు పరీక్ష ప్యాసుగాకపోతే. ఇంట్లో మంచినీళ్ళు దొరకవని రామం ముందు విలపించాడు. ఈ జ్ఞానం యింతకుముందేనా రాలేదని వాపోయాడు. రేపటి పేపరొక్కటీ వ్రాయగలిగితే తక్కినవన్నీ తను చూసుకోగలనని ప్రాధేయపడ్డాడు. పుస్తకాల్లో విషయాలు నూరి అతని మెదడులో ఎక్కించగల సాధనం వుంటే బాగుండు ననిపించింది రామానికి. అయినా, అతని బుర్ర దేన్నీ జీర్ణంచేసికోలేదని గుర్తుకువచ్చి ఆ ఆలోచన వదలిపెట్టాడు. కృష్ణయ్య ఏడుపు మొహం చూసి జాలివేసింది. తనకే యీ యిక్కట్టు వచ్చినట్లుగా బాధపడ్డాడు. 'సరే! వెళ్లు' అన్నాడు. కృష్ణయ్య రాత్రంతా నిద్రపోయ్యాడు. మర్నాడు తన పేపరుమీద కృష్ణయ్య నెంబరు వేసినట్లు, కృష్ణయ్యకి పరీక్ష అయినతర్వాత గాని తెలియదు. దొంగ నెంబరు వేసి, సిల్కు చీర కట్టుకొచ్చిన వాచరుకి పేపరు యివ్వబోతూ రామం అనుభవించిన బాధకి, యింక యములోకానికి వెళ్ళనవసరం వుండదనిపించింది. ఫలితాలు వూహించివుంటే తనాపని చెయ్యలేకపోయేవాడు. కృష్ణయ్య ఏడుపు మొహం గుర్తుకు రాకపోయినా తను పరీక్ష పూర్తిచేయగలిగేవాడు. వణకే తన చేతులు చూసి తను చేసినపని పోలుస్తుందేమోనని బిక్క మొహంతో ఆమెకేసి చూస్తూ నిలుచోవటం, ఆమె జారిపోయే తన సిల్కుచీరని పరీక్షిస్తున్నాడని భ్రమించి చీర సర్దుకొంటూ హడావడిగా పేపర్లు తీసికొని వెళ్ళిపోవటం—అంతా ఒక వింతగా తోచింది రామానికి. తన ఆవేదన, ఆమె కంగారు తలపుకువచ్చి నవ్వుకొన్నాడు. నెలరోజుల క్రితం కృష్ణయ్య పెళ్ళి శుభలేఖ పంపుతూ 'నీ సహాయం జీవితంలో ఎప్పుడూ మరువలేను ... అందువల్లనే యాభైవేలు కట్నం వస్తుంటట ప్రస్తుతం నాకు' అని తగిలించాడు తాజాకలం. 'పోనీ తను ఆధారంగా ఒకడైనా బాగుపడ్డాడు' అని తృప్తిపొందాడు.

మాణిక్యం యింటి సమీపానికి వచ్చాడు. తలుపులు వేసివున్నాయి. కిటికీ తలుపు ఓరగా వేసివుంది. ఆ అమ్మాయి ఆ సందులోనుంచి చూసి పిలుస్తుందేమోనని అడుగులు వేగంగా వేస్తున్నాడు. ఆమె అంటే తన కెందుకో అంత భయం. చాలా కాలంవరకూ నాన్న మాణిక్యం యింటికి వెళుతూంటాడని తనకూ తెలియదు. సుబ్బయ్య 'మీ సవతి తల్లికి నిన్ను చూడాలని వుందట' అనేవాడు తనతో. అప్పుడు కూడా వాటిని తనేమీ పట్టించుకోలేదు. ఓ రోజున సిల్కులాల్చీ జరీకండువాలతో ఓ పెద్దమనిషి, తన భుజంమీద చెయ్యి వేసుకొని ఈ మార్గాన్నే తీసుకుని వచ్చాడు, పెళ్ళి సంబంధం వుందని...అమ్మాయికి చదువుకొన్నవాడు కావాలంటోందట.

ఆమె తల్లిదండ్రులు పరువు ఆస్థి ముఖ్యమంటున్నారుట. ఈ రెండూ వున్నాయని తెలసి తన ఇష్టం కనుక్కోటానికి వచ్చాడని తేల్చాడు మెల్లిగా. రామం ఈ మాటలు విని లోలోపల సంతోషించాడు. అధమం పెళ్ళికూతురు దృష్టిలో తన చదువుకైనా విలువ వుందని. సమాధానం యివ్వటానికి ఏమీ తోచలేదు. దిక్కులు చూస్తున్నాడు మాటలకు తబ్బిబ్బుపడుతూ. ఒక్కసారి మొహం తెల్లబడింది—నెత్తురు అంతా ఆవిరి అయిపోయినట్లు. నాన్న మాణిక్యం యింటిలోకి వెళ్ళటం చూశాడు. ప్రాణాలు ఎవరో బలవంతంగా లాక్కెడుతున్నట్లనిపించింది. తనీ విధంగానే ఈ పాటిమట్టిలో కప్పడిపోతే బాగుండుననుకున్నాడు. తనకి పరువు ఎక్కడిది. ఆస్థి అసలే లేదు. గుట్టుగా నాన్న సంసారం నెట్టుకొస్తున్నాడు. అమ్మ అనేది 'నాన్న చదువు చెప్పించి, నీ ఆస్తంతా వెచ్చించారు.' తను అందుకూ బాధపడలేదు. అమ్మకి ఎప్పుడూ బెంగే తను బ్రతకటం చాతకాని వాడని. చచ్చిపోయేముందు తనకి యిచ్చిపోయిన సందేశం యిదేను. రామం కళ్ళలో నీళ్ళు తిరిగేయి. కంఠం మూగపోయింది. ఈ పెద్దమనిషి తన్నింతవరకూ తీసికొస్త ఈ దృశ్యం చూపించడానికేమో అని అనుమానపడ్డాడు. నరాలు కూడదీసుకొని ఆ పెద్దమనిషితో అన్నాడు. "నాకు పరువూ లేదు, ఆస్థీలేదు

మా నాన్న వ్యభిచారి. నా సంగతి నాకే తెలీదు... యిష్టమయితే మీ అమ్మాయిని యివ్వండి." ముందు అతను ఉద్రేకంలో అంటున్నాడనుకొన్నా ఆ మాటలు ఆయనకి అసందర్భంగా తోచలేదు. ఒక్క చదువు చూసి మాత్రం వాళ్లు యిష్టపడక పోవచ్చు" అని కండువా దులుపుకొని వెళ్ళిపోయాడు.

రామానికి అడుగు పడలేదు. ఇంటికి వెళ్లాలనిపించలేదు. మంచం పట్టిన అమ్మ, డాక్టరుకి మందులకి డబ్బులేక నిస్సహాయంగా యింటి చిల్లులు లెక్కపెట్టే నాన్న...ఆరోజున మాణిక్యం సంఘటన కళ్ళముందు తిరిగాయి. అమ్మ మూలుగుతోంది. చెల్లాయి భయంతో అమ్మకాళ్లదగ్గర పడుకొని వెక్కి వెక్కి ఏడుస్తోంది. తను అక్కడ ఉండలేక గదిలోకిపోయి ఏడుస్తున్నాడు, యింతలో మాణిక్యం మాటలుపూర్తీ అయ్యాయి. నాన్న కసురుతున్నాడు అమ్మను. "ఆ డబ్బుతో కొన్న మందుమాత్రం నేను పుచ్చుకోనని" అమ్మ నీరసంగా అంటోంది. ఆ మాటల్లో నిశ్చయం మాత్రం కనపడుతోంది. మాణిక్యానికి మొదట్లో డబ్బున్నవాళ్ళంతా మొగుళ్ళను. అందరూ బికారులయి పోయారు, ఆమెవల్లనే—అనే వదంతి ఆవూళ్ళో. "నిష్కారణంగా ఆమెని దంపెయ్యకండి బాబూ! మెల్లిగా ఒప్పించి ఈ డబ్బుతో మందు తెప్పించండి." మాణిక్యం నాన్న కాళ్ళ వేళ్ళపడి ప్రాధేయపడుతోంది. అమ్మ అంటోంది: 'ఈ ఆఖరి క్షణంలోనైనా నన్ను శాంతంగా వెళ్ళిపోనీండి'. అమ్మగొంతుకలో దీనత్వం రామాన్ని కలచివేసింది. ఆమె చివరికి మనశ్శాంతికూడా లేకుండా, చచ్చిపోతుందేమో నని భయం పుట్టింది. తను చివరి ఘడియల్లోకూడ ఏమీ చెయ్యలేనా అనుకొన్నాడు. గదిలోనుంచి ఉద్రేకంగా వచ్చి మాణిక్యం చేతులోని నోట్లని వీధిలోకి గిరవాటు పెట్టి, ఆమెను బయటికినెట్టి తలుపువేశాడు. చెమరుకొన్న కళ్ళను చీరకొంగుతో తుడుచుకొని మాణిక్యం వెళ్ళిపోయింది. శని విరగడయిందనుకొన్నాడు అప్పుడు... అమ్మపోయి నెల తిరగలేదు. తిరిగి ఆ శనిదేవత గృహంలో నాన్నని చూడగానే అవమానపు ఏరుల్లో ములిగిపోతున్నట్లనిపించింది...

నాన్నపోయి ఏడాది అవలేదు. మాణిక్యం మంచానపట్టి, తనని చూడాలని వుందని, ఒక్కసారి వచ్చిపొమ్మని బ్రతిమాలుతూ కబురంపింది యీ అమ్మాయిచేత. అమాయకపు దీనత్వాన్ని తెలిపే ఆమె కళ్లు, చూసి రామం జాలిపడ్డాడు. "పోనీ ఒకసారి చూసివస్తే, ఏమవుతుందీ" అనుకొని ఆమెతో 'సరే' అన్నాడు. ఆమె సంతోషం పట్టలేకపోయింది. అమ్మ చేయలేకపోయిన కార్యం తను సాధించుకొని వెళుతోంది. ఆమె వెళ్ళగానే సుబ్బయ్య ప్రత్యక్షమయ్యాడు. 'వాళ్ళ యింటికి వెళుతున్నావా?' అన్నాడు. 'ఎవరింటికి?' రామం ఆలోచించకుండానే. 'అదే—ఆ పిల్ల—అది మాణిక్యం కూతురు కాదులే...ఎవరిపిల్లనో పెంచుకొంది ... అందుకనే నీవు పరసాలాడినా ఫర్వాలేదు" సుబ్బయ్య నుక్క తిప్పుకోకుండా తన అక్కసు వెళ్ళబోసుకొని సమాధానానికి ఎదురుచూడకుండా వెళ్ళిపోయాడు. చిత్రవధ ఈ పరిహాసంకంటె బాధగా వుండదేమో. ఈ సుబ్బయ్యలు పుట్టడం సంఘంలో ఎవరి బాధ్యతలు వాళ్ళకి జ్ఞాపకం చెయ్యడానికా. ఊళ్ళోవాళ్లెవరూ నాన్న పోయినప్పటినుంచీ తనతో మాట్లాడకపోవటానికి కారణం ఈ అనుమానమే అయివుంటుంది. దీనికంతకీ నాన్న కారణం. "మీఅమ్మ చచ్చిపోత సగం ఈ బెంగతోనే" అని సుబ్బయ్యభార్య చెల్లాయితో అందిట. అవమానం అభిమానం ముంచెత్తాయి. మాణిక్యంగుమ్మం త్రొక్కకూడదని తీర్మానించుకొన్నాడు...మాణిక్యం చితిమీది పొగని దూరంగా, ఎవరికీ కనపడకుండా, ఆ అమ్మాయిదృష్టినుంచి తప్పించుకొంటూ చూశాడు. చీకటిపడిందన్న సంగతి నక్కల అలజడితో గుర్తుకువచ్చి, యింటికి తిరిగివచ్చాడు. ఆ అమ్మాయికంట పడటానికి ధైర్యం లేదు. ఆమె తనని చూసి చీదరించుకొని తలుపు వేసుకొంటుందని ఊహించాడు...

అందుకనే రామం కంగారుగా వేగంగా అడుగులు వేసికొంటూ ఆ యింటిబారినుండి ఎంత త్వరగా తప్పుకొంటావా అనుకొంటూ కృష్ణయ్య యింటి సమీపానికి వచ్చాడు. అదటుగా గుండెలు యింకా కొట్టుకొంటూనే వున్నాయి. "ఈ ఎండలో యిల్లా పరుగెత్తుకొంటూ వచ్చావేమిటి" అని సావకాశంగా కుర్చీలో భార్య అందించే తమలపాకులు నములుతున్న కృష్ణయ్య పలకరించే వరకూ తను పరుగెడుతున్నట్లు తెలియలేదు. మంచం దగ్గరకు లాగి కూర్చోమన్నాడు రామాన్ని. విసనకర్రయిస్తూ, రామం మొహంలోకి తేరిపారచూస్తున్న భార్యని 'మంచినీళ్లు తే' అని ఆజ్ఞాపించాడు. రామానికి ఈ మొహం పరిచయంగా తోచింది. పెళ్ళికి రాలేదేం? "ఊరక రారు మహానుభావులు..." అని ఆపదం సాగతీస్తూ రామంకేసి ప్రశ్నార్థకంగా చూచాడు.

రామానికి అన్నీ గుర్తుకొస్తూన్నాయ్. ఈమెనా, కృష్ణయ్య చేసికొన్నది. కాకినాడలో ఆమె ప్రక్క యింటిలోనే తను గది అద్దెకు తీసికొని వుండేవాడు. ఆమె నిత్యమూ కిటికీదగ్గర కూర్చుని సంగీతసాధకం చేసేది. మొదట్లో ఆడవాళ్లకి విర్రవీగటం ఎక్కువ, కాలేజీలో చదువుతున్నా నని టెక్కు అయుంటుంది అని సర్దుకొన్నాడు. కాని చదువుకి నిత్యం అంతరాయం కలగడం భరించలేక ఓరోజున కొంటెగా ఆమెకేసి చెయ్యి వూపాడు. ఆమె కిటికీ భళ్లున వేసి చప్పుడు చేసుకొంటూ వెళ్లిపోయింది. రామానికి ప్రాణాలుపోయాయి. శరీరం చెమటతో తడిసిపోయింది. వాళ్ళ నాన్న పోలీసు ఇన్స్పెక్టరు కూడాను. ఆమె తండ్రితో ఫిర్యాదు చేయవచ్చు. అతను తుపాకీతో తన్ను కాల్చివేస్తే... అసలు తుపాకీవరకు ఎందుకు...లాఠీకర్రతో వీపు బద్దలుకొట్టి ప్రక్కనే వున్న ఉప్పుటేరులోకి త్రోసివేస్తే చాలు...మెల్లిగా కిటికీ ప్రక్కన నక్కి వాళ్లయింటిలో ఏదైనా గొడవ జరుగుతుందేమో నని వింటున్నాడు. వాళ్లఅమ్మ బొంగురు గొంతుక వినిపించింది. ఆమె చీపురుకట్ట పుచ్చుకొని వస్తుందేమో నని భయం. తనని వీధిలోకి జుట్టుపట్టుకులాగి రోడ్డు మీద పోయే అందరిముందూ 'ఈ జంతువుని చూడండి మీరంతా' అని అంటుంది. అందరూ విరగబడి నవ్వుతారు. తన స్నేహితులంతా మందలించటానికి ముందుకు వస్తారు. తను చదువుకి తిలోదకాలిచ్చి పారిపోవాలి. ఈ ఫలితాలన్నీ వూహించి, ఈ గండం గట్టెక్కితే, యింకెప్పుడూ యిల్లాంటి తెలివితక్కువ పని చెయ్యకూడదని నిశ్చయించుకొన్నాడు. వాళ్ళ యింటిలో గొడవ సర్దుమణిగింది. వీధితలుపులు వేసిన చప్పుడు. మెల్లిగా క్రమంగా తన గదిముందు పిల్లి అడుగుల అలికిడి అయింది. భయపడుతూ రామం వెనక్కి తిరిగిచూచాడు కిటికీలోంచి. ఎవరూ లేరు. తలుపు తెరచి చూచాడు. గుమ్మంముందు ఆమె... రామం నిశ్చేష్టుడయ్యాడు. ఏదో అనబోయాడు. అవి గొంతుకలోనే వుండిపోయాయి. ఆమె గొడవ చెయ్యకన్నట్లు తన చేతిని తన నోటికడ్డంగా పెట్టి "అమ్మతో సినిమాకని చెప్పా"నంది మెల్లిగా. శరీరం మంచుగడ్డలా అయింది. ఏమి చెయ్యటానికీ ఆలోచించే శక్తి లేదు. అప్పుడే, తన గది ప్రక్కన యింటి ఆవిడ మాటలు వినిపించబట్టి రామానికి ఏంచెయ్యాలనే ప్రశ్నకి సమాధానం వెతికాలసిన అవుసరం కలుగలేదు. తన అదృష్టానికి అభినందించుకొని మర్నాడు ఉదయమే గది మార్చేశాడు.

'మంచినీళ్లు తీసికోవోయ్ ముందు' కృష్ణయ్య గొంతుకలోని ఆజ్ఞాపన వినిపించింది. మంచినీళ్లగ్లాసు పట్టుకొని ఆమె నిలబడివుంది. తల ఎత్తకుండానే గ్లాసు అందుకొని నీళ్ళన్నీ, అనుకోకుండా ఒక గ్రుక్కలో త్రాగేశాడు. 'ఎండనపడ్డావు బాగా' అన్నాడు కృష్ణయ్య సానుభూతి చూపిస్తూ. ఈ యింటిదగ్గరనుండి ఎంత త్వరగా వెళ్ళిపోతానా అనిపించింది.

చెల్లాయిని పురుటికి తీసుకొనిరావాలి. చేతిలో కానీ లేదు. వుద్యోగం ఖాళీ. నాలుగు రోజులయి యింటిలో తిండి లేదు. మిగిలివున్న అటుకులు నానవేసుకొని తిని బ్రతుకుతున్నాడు. అభిమానం చంపుకొని ఎవరినీ చేబదులు అడిగే ధైర్యం లేదు. ఈ రోజున ఆకలిబాధకి తాళుకోలేకపోయాడు. చచ్చిపోవటానికి ధైర్యం లేక బ్రతకటం చాతకాక సిగ్గు విడచి నిర్మొహమాటంగా డబ్బుకై కృష్ణయ్య దర్శనం చేసికోటానికి వచ్చానని—ఉన్న దంతా ఒక్క గుక్కలో చెప్పేయాలి అని తాను బయలుదేరేముందు అనుకొన్నాడు.

కృష్ణయ్యప్రశ్నలు సగం ధైర్యాన్ని చంపాయి. అతని భార్య తన వుద్దేశ్యాన్ని నిలువు గోతిలో పూడ్చిపెట్టింది. "పెళ్ళికి రాలేదేం? ఊరక రారు..." ఈ ప్రశ్నల తర్వాత కృష్ణయ్యని తను డబ్బు అడుగుతే, 'వీడి స్నేహం అంతా డబ్బుతోనే' వుంది అనుకోవచ్చు. శుభలేఖలో కృష్ణయ్య తాను చేసిన సహాయాన్ని త్రవ్వి జ్ఞాపకంచేశాడు. అది ఆధారంగా తీసికొని డబ్బు అడుగుతున్నా ననైనా అనుకోవచ్చు. తన స్నేహానికి డబ్బుతో విలువకట్టే అవకాశం కృష్ణయ్యకి ఎప్పుడూ యివ్వకూడదని నిశ్చయించాడు. పైగా ఆమె...అతని భార్యముందు అతన్ని యాచించడం..రామం నిశ్చయం మంచులా కరగిపోయింది. ఉదయంనుంచీ పడ్డ ఆకలిబాధలకన్న అభిమానం పైచెయ్యి తీసికొంది.

"ఏమీలేదు—చూసిపోదామని బయలుదేరా" నన్నాడు. తన సమాధానం తనకే నచ్చలేదు. కృష్ణయ్య కబుర్లధోరణిలో పడ్డాడు. కట్నం డబ్బుతో ఓ సినిమాహాలు కట్టించానని, అది ఈ జిల్లాలోకి మంచి అందమైనదని, ఈమధ్యనే ధాన్యం గిరాకిలో అమ్మి మిల్లు కట్టించానని, భార్య ఓ అదృష్టదేవత అని, యింకా తన తెలివితేటలన్నీ ఉపయోగించి డబ్బు చేసుకోటానికి, కనిపెట్టి అమలులో పెడుతున్న నూతనమార్గాలన్నిటినీ రామం ముందు

కళ్లెం వేస్తున్నాడు. ఈ వాగ్ఘాటితో రామం, తన్నొక మురికికాలవలోనుంచి లాకు పోతున్నట్లుగా బాధపడ్డాడు. ఇదంతా డబ్బు సంస్కృతి. దీనికి మరణం వుండదు. కృష్ణయ్య ఆగాడు. రామం తనమాటలేమీ అర్థం చేసుకొంటున్నట్లు లేదు. "ఏమోయ్ దారిలో ఏదైనా కరిచిందేమిటి" అన్నాడు. రామానికి ఆ ప్రశ్న అర్థం కాలేదు. 'ఏమిటి' అన్నాడు.

'అ...ఏమీ లేదు. ఆ మాణిక్యంకూతురుంది కదూ! అదేమైనా నిన్ను పలకరించిందేమిటి... ఈమధ్య ఏదో విన్నానులే' అని ఓ పొడిదగ్గు దగ్గాడు. రామానికి సమాధానం యివ్వటానికి అసహ్యం వేసింది. కృష్ణయ్యమాటలు తన్నిప్పుడు సహారా ఎడారిలోకి తీసికెళ్లి అక్కడ మండేయిసుకలో పూడ్చి వేశాయి. కుర్చీ సర్దుకొని కృష్ణయ్య అన్నాడు. "ఆ పతివ్రతకి మేమెవ్వరం పనికిరామట. పోనీ నిన్నైనా ఎన్నుకుంది" వెకిలిగా నవ్వాడు. పీకనులిమి కృష్ణయ్యని అల్లాగునే కుర్చీలో పాతివేస్తే బాగుండుననిపించింది. ఈ లోకంలోకి పొరపాటున పడ్డ జంతువు తను. కాటుబాధ భరించలేడు. తిరిగి కాటు వెయ్యలేడు. ధనంతో కండబట్టిన కృష్ణయ్యకి మాణిక్యం కూతురు పతివ్రత అయినందుకు బాధ కలిగింది. ఆ అక్కసు, తనమీద పెట్టి తీర్చుకొన్నాడు. తను మొదటినుంచీ, మాణిక్యాన్ని, ఆమెను ద్వేషించి, చివరకు తనూ ద్వేషింపబడుతున్నాడు. ఆమెకి తనకీ యేదో అవినాభావసంబంధం వుండాలనుకొన్నాడు. లేకపోతే వీళ్ళందరూ బలిపశువుగా తనని ఎన్నుకోవటం ఎందుకు? కృష్ణయ్యలు ఆమెని ఎంతోకాలం అల్లా బ్రతకనివ్వరేమో. అతని హేళనలో ఈ క్రూరత్వం స్పష్టంగా కనిపించింది రామానికి. ఆమెమీద ఏదో అభిమానం మమకారం పుట్టుకొచ్చాయి. అసలు తనెందుకు ఆమెను ద్వేషించాలో తెలియదు. ఏదో మబ్బుతెర...మంచుపొగ యిద్దరిమధ్య అడ్డుగావుంది. తను ఎప్పుడూ ఈ తెర తొలిగించి చూడవలసిన అవసరం కలుగుతుందనుకోలేదు.

రామం కృష్ణయ్యదగ్గర సెలవు తీసికొన్నాడు. ఇంటిముఖం పట్టాడు. ఆకలి అసలు వెయ్యటం లేదు. ఇల్లాగేవుంటే డబ్బు అవసరం వుండదు...కాళ్లీడ్చుకొంటూ కాలే కడుపుకి రగిలే ఆలోచనలని మేత వేస్తూ యింటి గుమ్మంలో కూలబడ్డాడు. దూరంగా ఆర్పబడ్డ యిళ్ళలోని జనం ఆక్రందనాలు...కడుపులో రగిలిన చితులు...పగిలిన హృదయావేదన. కదలిన మానవత్వపు శ్వాసలు...తనెందుకు మాణిక్యాన్ని ఆఖరిసారైనా చూడ్డానికి వెళ్ళలేదా అని వాపోయాడు. అసలు ఆ రోజున ఆమెను తన యింటినుండి వెళ్ళగొట్టకపోతే, నాన్న ఆమెదగ్గర డబ్బు తీసికొనేవాడేమో. అమ్మని డాక్టరుకి చూపించి జబ్బు నయం చేయించగలిగేవాడు. నాన్న, మాణిక్యాలు చచ్చిపోయేవారు కాదేమో అనిపించింది. ఇంతమందిని హత్యచేసింది తనేనని నిందించుకొన్నాడు. తన దురభిమానం...యిదే మాణిక్యాన్ని చంపింది—అప్పుడు. ఇప్పుడు తిరిగి ఆ అమ్మాయిని బలి తీసుకోవచ్చు కృష్ణయ్యలు ఎంతోకాలం ఆమె నల్లా బ్రతకనివ్వకపోవచ్చు. ఈ ఆలోచన రాగానే రామం భయపడాడు. తన దేదో, తన ఆత్మీయమైన వస్తువుని వాళ్ళంతా దొంగిలించుకుపోతున్నట్లు బాధపడ్డాడు. అమాయకంగా జాలిగొలుపుతూ ఆమె తనని బ్రతిమాలుతున్నట్లు ఊహించాడు. నీరసించిన ఆమె ఆకారం, పొగలోనుండి తనని బ్రతిమాలుతున్న మాణిక్యంహస్తాలు చీకట్లో స్పష్టంగా కనుపించాయ్...

రామానికి ఒకే మార్గం...ఆమె యింటివైపు దారితీశాడు. ఇంటిముందు నిలుచుండి మాణిక్యం అని పిలిచాడు. మాటలు పెదవులు దాటలేదు. ఇంట్లో అలికిడి వినిపించలేదు. తలుపు తట్టుతూ 'మాణిక్యం' అని గట్టిగా అరిచాడు. నాలిక కొరుక్కొన్నాడు, 'మాణిక్యం' అని పిలచినందుకు. మళ్లీ ఈమెకి చచ్చిపోయిన మాణిక్యాన్ని గుర్తుచేస్తున్నందుకు విచారించాడు. మాణిక్యాన్ని తనే చంపాడేమో నిజంగా. ఆఖరిసారి ఆమె కోర్కెను మన్నించలేకపోయాడు. కృష్ణయ్యలు తనవల్ల డబ్బు చేసుకోగలిగారు. మాణిక్యాలు కృశించి చచ్చిపోతారు. తనుమాత్రం కృష్ణయ్యల ఆటలు సాగనివ్వకూడదు అని నిశ్చయించుకొన్నాడు. కళ్లలో యేదో సంతృప్తి వెలిగింది. తలుపు తీయబడింది. ఆ సన్నని దీపపుకాంతి గదిలో సగం చీకటిని వదిలేస్తోంది. ఆ మసక కాంతిలో పాలిపోయిన ఆమె మొహం కొడగట్టబోయే దీపంలా కనిపించింది. ఈమె జీవితాన్ని కొడికట్టనివ్వకూడదనిపించింది.

“నిన్ను కృష్ణయ్యలకి అప్పగించను..ఎప్పుడూ యింక నేనిక్కడే” ఏదో అనబోయాడు. ఆమె అస్పష్టపు మాటలు రామం పెదవుల్లో కలసిపోయాయ్.